
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 30 ఏప్రిల్ 2025 5 ఏలూరు




ఉపాధి కూలీ మృతి



మృతదేహం వద్ద జనసేన నాయకులు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ఉపాధి హామీ కూలీ వడదెబ్బతో మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన పెంకె వెంకన్న(67) ఉపాధి పని ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో వడదెబ్బ తగిలి కళ్లు తిరిగి పడిపోయాడు. స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కూలీ మృతిపై జనసేన మండల అధ్యక్షుడు మొలిశెట్టి యుగేందర్ స్పందించి స్వయంగా అధికారులతో వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు కుటుంబానికి రావలసిన పాలసీ క్లైమ్ వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే స్థానిక ఎంఎల్‌ఎ బాలరాజుకు సమాచారం అందించారు. మృతుడు కుటుంబానికి అందాల్సిన పరిహారం త్వరగా అందేలా కృషిచేయాలని ఎంఎల్‌ఎను కోరారు.



కూటమి సర్కార్ కౌలురైతులను తీవ్రంగా వంచిస్తోంది. తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తెచ్చి న్యాయం చేస్తామని చెప్పిన నాయకులు ఏడాది గడిచినా చట్టం తీసుకురాని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన ఖరీఫ్, రబీ సీజన్లలో కౌలురైతులకు అరకొర కౌలుకార్డులు, రుణాలతో సరిపెట్టి మమ అన్పించారు. తాము పండించిన ధాన్యం సైతం తమ పేరున అమ్ముకోలేని దుస్థితిలో కౌలురైతులు ఉన్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ఈ ఏడాదైనా తమకు న్యాయం చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

'కౌలు' ఘోష పట్టదా..!

- కూటమి సర్కార్‌లో కౌలురైతులకు దక్కని ఊరట
- ఏడాది గడిచినా కొత్త చట్టం ఊసే కరువు
- అరకొర కౌలుకార్డులు, పంట రుణాలతో మమ
- పండించిన ధాన్యం సైతం తమ పేరున అమ్ముకోలేని దుస్థితి
- అన్నదాత సుఖీభవ కౌలురైతులకు దక్కేనా
- ఏలూరు, పశ్చిమలో మూడు లక్షల మంది కౌలురైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. రెండు జిల్లాల్లోని వ్యవసాయ సాగులో 80 శాతం వరకూ కౌలురైతులే చేస్తున్నారు. కౌలురైతులు లేకపోతే సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. అటువంటి కౌలురైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2019లో వైసిపి సర్కార్ తెచ్చిన కౌలుచట్టంతో భూయజమాని అంగీకారం లేకుండా కౌలుకార్డులు ఇచ్చే అవకాశం లేదు. వైసిపి సర్కార్ తెచ్చిన చట్టం కౌలురైతులకు ఉరితాడుగా మారింది. దీంతో కౌలురైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తెస్తామని కూటమినేతలు తెలిపారు. కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అప్పట్లో అనేక సభల్లో చెప్పారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే కౌలురైతుల కొత్తచట్టంపై పెద్దఎత్తున హడావుడి చేశారు. పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరిట సమావేశాలు సైతం నిర్వహించారు. అంతలోనే అర్థాంతరంగా అన్ని పనులూ నిలిపివేశారు. కూటమి సర్కార్ వచ్చి ఏడాది గడిచినా ఇప్పటి వరకూ కొత్త చట్టం తీసుకురాలేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కౌలురైతులకు కౌలుకార్డులు అరకొరగా జారీ చేసి తూతూమంత్రంగా పంట రుణాలిచ్చి సరిపెట్టిన పరిస్థితి ఉంది.

ఈ ఏడాదైనా న్యాయం చేస్తారా..?

గత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 62,647 మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా జారీ చేసిన కార్డులు మాత్రం 52,059 మాత్రమే. కార్డులు పొందిన రైతుల్లో 23 వేల మందికి రూ.142.85 కోట్లు మాత్రమే పంటరుణాలు ఇచ్చారు. పశ్చిమలో 1,08,330 కౌలుకార్డుల జారీ లక్ష్యం పెట్టుకోగా 85,125 కార్డులు జారీ చేశారు. ఇచ్చిన రుణం 24 వేల మందికి రూ.235 కోట్లు మాత్రమే. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో ఈ రుణాల మంజూరు ఒక్కశాతం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. జూన్ నుంచి ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతోంది. అన్నదాత సుఖీభవ సొమ్ము సాగు చేసే రైతులకు మాత్రమే ఇచ్చే పెట్టుబడిసాయం. భూయజమానికి కాకుండా కౌలు రైతులకు మాత్రమే ఈ సొమ్ము అందించాలి. ఆ విధంగా చేయాలంటే కౌలుకార్డుల జారీ ప్రక్రియ పక్కాగా జరగాలి. కొత్త చట్టం తీసుకు రాలేదు. మరి ఏవిధంగా కౌలురైతులను గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తారో ప్రభుత్వం చెప్పాలి. అలాకాకుండా వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కౌలురైతులకు అన్యాయం చేస్తుందో వేచిచూడాలి. కౌలుకార్డులు పక్కాగా జారీ చేసి పంటరుణాలు అందించినప్పుడు కౌలురైతులకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం అటువైపు ఆలోచిస్తున్నట్లు ఏమాత్రం కన్పించడం లేదు. అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కౌలురైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని చెప్పొచ్చు.

తాగునీటి సమస్య లేకుండా పటిష్ట చర్యలు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - చాట్రాయి

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై మండలస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మండలంలో చేపడుతున్న స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ, వృద్ధాప్య, వితంతు పింఛన్ల పంపిణీ ప్రగతిపై ఆరా తీశారు. పింఛన్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎక్కడైనా నిలుపుదల చేస్తే అందుకు తగిన కారణాలు సంబంధిత పింఛన్‌దారునికి తెలియజేయాలన్నారు. గతంలో కట్టిన మంచినీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వినియోగించుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ నిధులు రోడ్ల నిర్మాణాలకు ఖర్చు చేయకుండా తాగునీరు, పారిశుధ్యానికి ఖర్చు చేయాలన్నారు. చెత్త, దోమలతో గ్రామాలు నిండిపోయాయని, వాటి నివారణకు కాలువల నిర్వహణపై శ్రద్ధ చూపాలని మంత్రి అన్నారు. శ్మశాన వాటికల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ తల్లికి వందనం అందేలా చూడాలని విద్యా శాఖాధికారిని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'నీట్'కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలు
హాజరు కానున్న 1200 మంది అభ్యర్థులు
కలెక్టర్ కె.వెట్రిసెల్వి



కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మే 4న నీట్ యూజి (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నీట్ యూజి జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4న జరిగే నీట్ పరీక్షకు ఏలూరులోని కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్, దెందులూరు మండలం గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయం, గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షకు 1200 మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష మే 4వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. పరీక్షా పేపర్లు తెచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్షా పేపర్లను సూపరింటెండెంట్లు పోలీసుల సహకారంతో తీసుకురావాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో వీల్‌చైర్లు, సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం పరిధిలో 144వ సెక్షన్ అమలు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్లు అనుమతించబడవన్నారు. కేవలం అడ్మిట్ కార్డుతో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పెన్నులు తదితరాలు పరీక్షా కేంద్రంలో అందిస్తారన్నారు. పరీక్షల నిర్వహణకు సిటీ కోఆర్డినేటర్‌గా కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ వ్యవహరిస్తారన్నారు. పోలీస్ శాఖ తరపున ఏలూరు డిఎస్‌పి, విద్యాశాఖ తరపున డిఇఒ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఉంటారని, ప్రతి పరీక్షా కేంద్రానికి తహశీల్దార్లు మెజిస్ట్రేరియల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. వీరు పరీక్ష ముందురోజు ఆయా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లనూ పరిశీలించాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, సిటీ కోఆర్డినేటర్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ బూర్‌సింగ్ మీనా, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, తహశీల్దార్లు జివి.శేషగిరి, బి.సుమతి, ఎన్ఐసి డిఐఒ బి.భానుప్రకాష్, ఆయా పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాల్స్, విద్యుత్, ఆయా బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యఆరోగ్య శాఖ ముద్రించిన వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలనొప్పి, అలసట, ఒళ్లునొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సూర్య కిరణాలు శరీరంపై పడకుండా చూసుకోవాలని, ఒఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని సూచించారు. ఎండల్లో బయట తిరగొద్దని, ఉదయం, సాయంత్రం మాత్రమే అత్యవసర పనులు చేసుకోవాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటికే పరిమితం కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిసిపిఒ డాక్టర్ సూర్యచక్రవేణి, పలువురు వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో దేన్నయినా సాధించొచ్చు: కలెక్టర్

ఉన్నత లక్ష్యం, పట్టుదలతో దేనినైనా సాధించొచ్చని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో కోవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలు పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్‌లో ఉన్న లబ్దిదారులతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 26 మంది బాలబాలికలకు గార్డియన్‌గా ఉన్న కలెక్టర్ ఆ పిల్లలతో మమేకమై ప్రతిఒక్కరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆకాష్ పరీక్షలో తప్పిన ఒక సబ్జెక్టుకు సప్లిమెంటరీ పరీక్ష రాయించి రిజల్ట్ వచ్చిన తర్వాత తనకు తెలియజేయాలని డిసిపిఒకు సూచించారు. 18 సంవత్సరాలు వయస్సు నిండి వివాహం చేసుకున్న ఇద్దరు యువతులను కలెక్టర్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన ఇద్దరు బాల బాలికలకు రూ.10 లక్షలు డిపాజిట్ అయిన పోస్టల్ పాస్‌బుక్స్‌ను కలెక్టర్ అందజేశారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
బస్సు కండక్టరు, లారీ డ్రైవర్‌తోసహా ఏడుగురికి గాయాలు
రోడ్డు మార్జిన్, తుప్పలతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు



బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాడేపల్లిగూడెం నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్న ఆర్‌టిసి బస్సును నంద్యాల నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న సిమెంటు లారీ బాదంపూడి శివార్లలో జాతీయ రహదారికి సమీపంలో మలుపు వద్ద మంగళవారం ఉదయం ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, బస్సు కండక్టర్‌తో పాటు మరో ఐదుగురు గాయాల పాలయ్యారు. బస్సు డ్రైవర్ పిఎన్.వెంకటేష్ కథనం మేరకు తాడేపల్లిగూడెంలో 22 మంది ప్రయాణికులతో ద్వారకాతిరుమల బస్సు బయల్దేరింది. ఈ బస్సు సరిగ్గా బాదంపూడి శివార్లలో జాతీయ రహదారి వై-జంక్షన్ సమీపంలో మలుపు తిరుగుతుండగా జాతీయ రహదారి వై-జంక్షన్ నుంచి తాడేపల్లిగూడెం వైపు సిమెంటు లారీ అతి వేగంగా దూసుకొచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ బస్సును కాల్వ గట్టు వైపు మార్జిన్‌లోకి మళ్లించినా సిమెంటు లారీ బస్సును ఢీకొట్టి ముందుకు దూసుకెళ్లింది. దీంతో బస్సు ఒక్కసారిగా తీవ్ర కుదుపులకు లోనై ప్రయాణికులు ఒకరిపై మరొకరు పడిపోయారు. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ సిహెచ్.వెంకటరమణతోపాటు ప్రయాణికులు రౌతు సరోజ, ఇ.మేఘన, కర్రి వికాస్, ఆర్.తేజస్విని, పావని స్వల్పంగా గాయపడ్డారు. 108 అంబులెన్సులో వీరిని తాడేపల్లిగూడెం తరలించారు. సిమెంటు లారీ డ్రైవర్ చవల రమేష్ తలకు గాయమైంది. బస్సు కండక్టర్, లారీ డ్రైవర్ తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా గాయాల పాలైన ప్రయాణికులు ప్రయివేటు ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. సిమెంటు లారీ డ్రైవర్‌కు లైసెన్స్ కూడా లేదని సమాచారం. ప్రమాదం కారణంగా కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పలు వాహనాలు బాదంపూడి ఊళ్లోంచి హైవే మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చేబ్రోలు పోలీసులు, హైవే రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆర్‌టిసి అధికారులు మిగిలిన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు పంపించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్జిన్‌లో గోతులు, తుప్పల వల్లే నిత్యం ప్రమాదాలు

బాదంపూడి వై-జంక్షన్ కల్వర్టు దాటగానే మలుపు వద్ద తారురోడ్డుకు, మార్జిన్‌కు చాలా వ్యత్యాసం ఉంది. ఇక్కడ రోడ్డుకన్నా అడుగు పల్లంలో మార్జిన్ ఉండటం గమనార్హం. దీనికితోడు ఇరుకు రోడ్డు, మలుపు కావడంతో వాహనాలన్నీ మలుపు తిరిగే సమయంలో సరిగ్గా రోడ్డు మధ్యలోంచి వెళ్లాల్సి వస్తోంది. అదే సమయంలో తాడేపల్లిగూడెం నుంచి బాదంపూడి వై-జంక్షన్ చేరే వాహనాలు అలానే రావాల్సి వస్తుంది. ఈ క్రమంలో వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. రోడ్డు మార్జిన్ ఎత్తు చేస్తే అక్కడ రోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉందని వాహనదారులు చెబుతున్నారు.

ఇదేచోట జెడ్‌పిటిసి సభ్యుడు మృతి

2006 డిసెంబరు 7న ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యుడు కాటి నారాయణరావు బైక్‌పై తాడేపల్లిగూడెం నుంచి నారాయణపురం వైపు బైక్ మీద వస్తుండగా ఈ మలుపు వద్ద ఆటో ఢీకొంది. ఆయన తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇదే ప్రాంతంలో నిత్యం చిన్నాచితక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు కాటి కిరణ్‌కుమార్ కోరారు.



రోడ్డుకు, మార్జిన్‌కు మధ్య వ్యత్యాసం (సర్కిల్‌లో)

తాడేపల్లిగూడెం: బాదంపూడి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన బస్సు కండక్టర్ సిహెచ్.వెంకటరమణ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సును లారీ ఢీకొనగానే తాను ఒక్కసారిగా సీట్లోంచి కింద పడిపోయానని, దీంతో తలకు, కాలికి గాయాలయ్యాయని చెప్పారు.

గాలి వాన బీభత్సం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
భయానక వాతావరణంలో బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



కౌరశాలపై కూలిన చెట్లు

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు గాలి వాన బీభత్సం సృష్టించింది. ఎప్పుడూ లేనంతగా భూదేవి పేట, మల్లారం, చిన్న బుర్ర తోగు గ్రామాలలో భయానక వాతావరణ పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ చెట్లు విరిగి, కరెంట్ స్తంభాలు పడిపోయి ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొన్నారు. కనీసం ఇళ్లలో నుంచి వస్తే ఏ చెట్టు మీద పడతాయని గాలివాన తగ్గే వరకు పిల్లాపాపలతో భయానక వాతావరణంలో గడిపారు. ఎక్కడికక్కడ కరెంటు స్తంభాలు పడి, చెట్లు విరిగిపోయి రహదారులపై పడిపోవడంతో వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. భూదేవి పేట నుంచి చాగరపల్లి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద చెట్లు పడిపోయి ఎక్కడికక్కడ కరెంటు సర్వీస్ వైర్లు కూడా తెగిపోయి ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. బుర్ర తోగులోని స్థానిక అంగన్వాడీ సెంటర్ వద్ద కరెంటు స్తంభం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విరిగి అంగన్వాడీ సెంటర్ మీద పడింది. ఆ సమయంలో అంగన్వాడీ సెంటర్ వద్ద ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. అదే వరుసలో పెద్ద వేపచెట్టు విరిగి ఆకుల సురేంద్రకు చెందిన ఆటో మీద పడింది. వెల్డింగ్ పనులు చేసుకుంటూ ఆ ఆటోలో సామాన్లు చేర వేసుకుంటుంటాడు. ఆ చెట్టు పడిపోవడంతో ఆటోకి ఏదైనా జరిగితే జీవన భృతిని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూదేవిపేట గ్రామంలో వేలూరి సూరిబాబు భార్య లక్ష్మి గాలి వానకు మంగలి షాపు మీద చెట్లు విరిగిపడడంతో అది కూలిపోయింది. భర్తకు అనారోగ్య కారణాల చేత నాన అవస్థలు పడుతున్నారు. వారికున్న మంగళ షాపును అద్దెకి ఇచ్చి ఆమె కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఆ షాపు కూలిపోవడంతో మాకు జీవనభృతి ఎలాగని కన్నీరు మున్నీరవుతున్నారు. మండలంలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజ లు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడికక్కడ ఈదురు గాలులతో గాలివాన బీభత్సం సృష్టించడంతో భయానక వాతావరణ పరిస్థితి నెలకొని ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. ఎక్కడికక్కడ కరెంట్లు వైర్లు తెగిపోవడంతో పిల్లాపాపలతో రాత్రి ఎలా గడుస్తుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. విషయం తెలుసుకున్న కరెంటు సిబ్బంది వెంటనే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్తంభాలు పడిపోయిన చోట సర్వీసులు తప్పించి విద్యుత్ పునరుత్పత్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.



అంగన్వాడీ సెంటర్‌పై కూలిన కరెంటు ట్రాన్స్‌ఫార్మర్

394.795 కిలోల గంజాయి పట్టివేత

రెండు వాహనాలు స్వాధీనం
ఐదుగురు అరెస్టు



మాట్లాడుతున్న ఐజి ఎ.రవికృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సమీపంలో రెండు వాహనాల్లో తరలిస్తున్న 12 బస్తాల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఈగల్ టీమ్ ఐజి ఎ.రవికృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, ఈగల్ టీమ్ ఎస్‌పి నగేష్‌బాబుతో కలిసి మాట్లాడారు. రెండు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టగా ఒక కారు, ఒక మినీ వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని 394.795 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు వివరించారు. జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ గంజాయి విలువ రూ.39 లక్షల 47,950గా గుర్తించామన్నారు. ఈ కేసులో గంజాయిని రవాణా చేస్తున్న కాకినాడ జిల్లాకు చెందిన నాయుడు రాజా, బొంతు దుర్గా సతీష్, కుడితి చిన్నిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ గంజాయిని సరఫరా చేస్తున్న కాకినాడ జిల్లాకు చెందిన మనం చంద్రదొర (దొరబాబు), ఈపు ధనరాజ్‌లను అరెస్ట్ చేశామన్నారు. గంజాయి పట్టివేతలో చాకచాక్యంగా వ్యవహరించిన జంగారెడ్డిగూడెం ఎస్ఐ ఎస్‌కె.జబీర్, ఎఎస్ఐ సంపత్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ రమేష్, బి.రాజశేఖర్‌లను ఆయన అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు.

గిరిజన ప్రత్యేక డిఎస్‌సికి ఆర్డినెన్స్ తీసుకురావాలి

2న గిరిజన బంద్‌కు సిపిఎం మద్దతు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : గిరిజన ప్రత్యేక డిఎస్‌సికి ఆర్డినెన్స్ తీసుకురావాలని, ప్రభుత్వం జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించాలని, గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని కోరుతూ మే 2న గిరిజనులు చేపట్టనున్న బంద్‌కు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంత నిరుద్యోగుల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహణకు ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల పర్యటన సమయంలో జిఒ నెంబర్ 3ను పునరుద్ధరిస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలను నూటికి నూరుశాతం గిరిజనులకే ఇవ్వాలని, కానీ మైదాన ప్రాంతంలో ఉండేవారిని తీసుకెళ్లి షెడ్యూల్ 5 ప్రాంతంలో ఉద్యోగాలు ఇస్తోందని తెలిపారు. 1200 మంది గిరిజనులను తొలగించి వారిస్థానంలో గిరిజనేతరులను తీసుకెళ్లి నియమిస్తోందని విమర్శించారు. కేటగిరైజేషన్ కోసం డిఎస్‌సి వాయిదా వేశామని చెప్పారని, గిరిజనులను వారి ప్రాంతంలో నియమించేందుకు ఎందుకు కేటగిరి చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో గిరిజనులు గందరగోళ పడుతున్నారని, వారికి జరుగుతున్న అన్యాయానికి మే 2వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చారని, గిరిజనులు నిర్వహిస్తున్న న్యాయమైన ఆందోళనకు సిపిఎం మద్దతు ఇస్తుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో పదివేలమంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకుంటే అందులో 1600 పోస్టులు అక్కడ ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తిగా గిరిజనులకు ఇవ్వకుండా బయట ప్రాంతాల వారికి ఇవ్వడం షెడ్యూలు 5 ప్రకారం వారికున్న హక్కులను కాలరాయడమేనని, దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. జిఒ 3 పునరుద్ధరణ విషయంలో ప్రభుత్వం చెబుతున్న దానికి, చేస్తున్న దానికి పొంతన లేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఎన్నికలు అయిన తరువాత మర్చిపోయారని విమర్శించారు. వెంటనే జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించడంతోపాటు గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని కోరారు. గిరిజనులు చేసే న్యాయమైన పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు.

'చింతలపూడి ఎత్తిపోతల'ను పూర్తిచేయాలి

ఎడమ కాలువల ఆధునీకరణకు 16వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేయాలి
నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం తీర్మానం

నూజివీడు టౌన్ : ఎడమ కాలువ 3వ జోన్‌లోని 2.36 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తిచేయాలని, ఎడమ కాలువకు 32 టిఎంసిల అధికార వాట ఉన్నప్పటికీ ఈ సీజన్లో 20 టిఎంసిలు మాత్రమే సాగునీరు తెలంగాణ నుంచి మనకు అందాయని ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం నూజివీడులోని ఎడమ కాలువ డివిజన్ కార్యాలయంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కాంపిటెంట్ అథారిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎంఆర్.మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ గత తీర్మానం ప్రకారం కృష్ణానది యాజమాన్యం బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఎడమ కాలువ పరిధిలో 2వ, 3వ జోన్‌లో కాలువల నిర్వాహణకు ఎస్టిమేట్లు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. అనంతరం ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 3వ జోన్ పరిధిలోని బాపులపాడు మేజర్, వేంపాడు మేజర్, మాచవరం మేజర్, జక్కంపూడి మేజర్, జమలాపురం మేజర్, మూలపాడు మేజర్, ఇబ్రహీంపట్నం మేజర్లకు కనీసం సాగునీరు అందలేదని, నీటి నిర్వహణ సామర్థ్యం పెంచడానికి, ఆధునీకరించడానికి 16వ ఆర్థిక సంఘం నుంచి ఎడమ కాలువల ఆధునీకరణకు ప్రతిపాదించిన రూ.199 కోట్ల నిధులను మంజూరు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడారు. ఎపలువురు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు మాట్లాడుతూ ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అనధికార ఆక్రమణలను తొలగించాలన్నారు. ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన 15 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పాలిసెట్‌పై అవగాహన

నూజివీడులో పర్యటించిన పాలిసెట్ రాష్ట్ర సెక్రటరీ రామచంద్రరావు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో పాలిసెట్ రాష్ట్ర సెక్రటరీ జివి.రామచంద్రరావు మంగళవారం పర్యటించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పాలిసెట్ సెంటర్లను పరిశీలించి సెట్ నిర్వహణ పట్ల అవగాహన కల్పించారు. జెడ్‌పి గర్ల్స్ హైస్కూల్లో బాలురు 108, బాలికలు 204 మొత్తం 312, బాయ్స్ హైస్కూల్‌లో బాలురు 293, బాలికలు 163 మొత్తం 456 మంది విద్యార్థులు సెట్ రాయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సెట్ నిర్వహిస్తారు. జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్ సిఎస్‌గా డొక్కు శ్రీనివాసరావు, ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాయ్స్ హై స్కూల్ సిఎస్‌గా అప్పారావు వ్యవహరిస్తారు. నూజివీడు పట్టణంలో మొట్టమొదటిసారి పాలిటెక్నిక్ సెట్ (ఎపి పాలిసెట్) నిర్వహణ పట్ల సిబ్బందికి వివిధ అంశాలలో అవగాహన కల్పించారు. పాలిసెట్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో చల్లని నీరు, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కోఆర్డినేటర్ వివి.కృష్ణమోహన్, రూట్ ఆఫీసర్ ఎలీషా, పరిశీలకులు అబ్దుల్ రహిమాన్, సంజీవరావు, నూజివీడు పాలిటెక్నిక్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమ్మెలో పాల్గొన్న హెల్త్ ఆఫీసర్లు

ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్ ఇవ్వాలి

రెండోరోజు కొనసాగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె

ఏలూరు అర్బన్ : తమకు రావాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్‌లతోపాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజు కొనసాగింది. మంగళవారం నూజివీడు, జంగారెడ్డిగూడెం డివిజన్లకు చెందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం కొనసాగిస్తూ సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సొంగా సిద్దయ్య, జిల్లా కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ 2018లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా విధుల్లో చేరిన తాము జిల్లా వ్యాప్తంగా 481 మంది పనిచేస్తున్నామని, తమకు రూ.25 వేల జీతంతో పాటు రూ.15 వేల పని ఆధారంగా ఇన్సెంటివ్‌లు ఇస్తున్నారని, అయితే గత ఎనిమిది నెలలుగా ఇన్సెంటివ్ నిలుపుదల చేశారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, నిలుపుదల చేసిన పిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గత 15వ తేదీ నుంచి వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో గత్యంతరం లేక నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని తెలిపారు. కె.ప్రసన్న, కరుణ, రేష్మ, వెంకటకృష్ణ, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్‌గా డాక్టర్ ప్రసాద్

ఏలూరు అర్బన్ : రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్‌గా డాక్టర్ ఎన్‌బిఎస్‌వి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో మంగళవారం డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు అధ్యక్షతన రెడ్‌క్రాస్ ఎపి స్టేట్ బ్రాంచ్ అబ్జర్వర్ పి.రామచంద్ర రాజు ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో రెడ్ క్రాస్ నూతన కమిటీ సభ్యులుగా 11 మంది సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్‌గా డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, వైస్ ఛైర్మన్‌గా జె.సత్యనారాయణ రాజు, ట్రెజరర్‌గా ఎన్.బ్రహ్మానందం, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, మునగాల మురళీకృష్ణ, కొత్త గుండు శ్రీనివాస్, మేతర అజయ్ బాబు, పెన్మత్స శ్రీరామరాజు, మోతే పల్లి చంద్రశేఖర్, బొల్లా లక్ష్మీనారాయణ, ఎంవివిఎస్.నాగేశ్వరరావు రెడ్‌క్రాస్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ ఆడిటర్‌గా గురజాడ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ, ఎపి రెడ్‌క్రాస్ అబ్జర్వర్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ ఎన్‌వి.నాంచారయ్య, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, గురజాడ శ్రీకాంత్, రెడ్ క్రాస్ సభ్యులు కడియాల కృష్ణారావు, కూచిపూడి సత్యనారాయణ, రేవూరి శివప్రసాద్, అడుసుమిల్లి నిర్మల, బిఆర్ సిహెచ్.నారాయణ హాజరయ్యారు.

బెట్టింగ్‌రాయుళ్లు అరెస్ట్

ముదినేపల్లి : మండలంలోని చిగురుకోట గ్రామంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో కొంతమంది వ్యక్తులు ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ ఉండగా ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు తన సిబ్బందితో దాడిచేసి 8 మందిని పట్టుకున్నారు. వీరి వద్దనుంచి రూ.8 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వీరభద్రరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా ఐపిఎల్ మ్యాచ్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించినా, లేదా ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకోబడతాయన్నారు. అదేవిధంగా మైనర్లకు నడపమని వాహనాలు ఇచ్చిన ఎడల వాహనాలు ఇచ్చిన వారిపైన, వాహనం యజమానిపైన కేసులు నమోదు చేస్తామన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, కోడిపందేలు నిర్వహించినట్లయితే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి జైలు శిక్ష

నూజివీడు టౌన్ : బాకీ తీర్చమని ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి టి.నర్సాపురం మండలం వెలగపూడి గ్రామానికి చెందిన చింతపల్లి చక్రసాయి రాంబాబుకు ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2018 నవంబర్ 18న బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన టి.గోపాలకృష్ణ సి.చక్రసాయి రాంబాబుకు రూ.2 లక్షల అప్పు ఇచ్చారు. కొంతకాలం తరువాత ఆ బాకీ తీర్చమని గోపాలకృష్ణ అడుగగా చక్రసాయి రాంబాబు రూ.లక్ష 50 వేలకు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు గోపాలకృష్ణ బ్యాంకులో వేయగా చక్రసాయి రాంబాబు అకౌంట్లో నగదు లేని కారణంగా తిప్పి పంపింది. అనంతరం గోపాలకృష్ణ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం చక్రసాయి రాంబాబుకు ఆరు నెలల జైలు శిక్ష, రెండు నెలల జరిమానా న్యాయమూర్తి విధించారు.

పెట్రోల్‌తో నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటుచేసుకుంది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన డి.పోసయ్య(40) స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం అతని ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో వంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంట్టించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

బొలెరో వాహనం టైరు పేలి కూలీ మృతి

మరో నలుగురుకి గాయాలు

ఏలూరు స్పోర్ట్స్ : అరటి గెలల లోడుతో ప్రయాణిస్తున్న బొలెరో వాహనం టైరు ఒక్కసారిగా పేలడంతో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఐదుగురు కూలీలలో ఒక కూలీ మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. డ్రైవర్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. సంబంధిత వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన నలుగురు కూలీలు ఎపి39 ఎసి 5984 నెంబర్ గల బొలెరో వాహనంలో ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామంలో అరటి తోటల్లో అరటి కాపును బొలెరో వాహనంలో లోడ్ చేసుకున్నారు. అనంతరం లింగంపల్లి గ్రామానికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం సరిగా ద్వారకచర్ల మండలం గున్నంపల్లి సమీపానికి చేరుకునే సరికి బొలెరో వాహనం టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ కాకర్ల లవరాజు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అనుబోలు రామకృష్ణ(55) అనే కూలీ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలించిన తర్వాత మృతిచెందాడు. మరో ముగ్గురు కూలీలు గాయాలపాలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని(ఫైల్)

తాడేపల్లిగూడెం, చింతలపూడి : నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక గొల్లగూడెం సెంటర్లో సాంఘిక సంక్షేమ శాఖ గర్ల్స్ హాస్టల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పాత చింతలపూడి గ్రామానికి చెందిన కె.తేజస్విని(21) తాడేపల్లిగూడెం మదర్ వన్నీ నర్సింగ్ కళాశాలలో బిఎస్‌సి నర్సింగ్ ఫైనలియర్ చదువుతుంది. స్థానికులు, సహచర విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం తాము రూమ్‌కు వెళ్లేసరికి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుందన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయగా రూరల్ ఎస్ఐ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తేజస్విని ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. త్వరలోనే నర్సింగ్ విద్య పూర్తి చేసుకుని ఉద్యోగం చేస్తానని చెప్పిన తేజస్విని విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడేను జయప్రదం చేయాలి

కరపత్రాల ఆవిష్కరణలో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - భీమడోలు


భీమడోలు : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పని హక్కుగా ఎనిమిది గంటలకు సాధించిన రోజైనా మే ఒకటవ తేదీన దానిని రక్షించుకోవలసిన పరిస్థితులు ఏర్పడటం సరికాదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మే ఒకటవ తేదీన మేడే కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. భీమడోలు సిఐటియు కార్యాలయంలో మేడే గోడపత్రికను ఆయన సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మే డే ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, మండల నాయకులు ఎం.పానకాలు, కె.విజయ్ పాల్గొన్నారు. భీమడోలులో మంగళవారం నిర్వహించిన ఐసిడిఎస్ భీమడోలు సెక్టార్ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మేడేతో పాటు సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని అంగన్వాడీ కార్యకర్తలను కోరారు.

జంగారెడ్డిగూడెం : మేడేను జయప్రదం చేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో మున్సిపల్ నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్.నాగరాజు అధ్యక్షతన జరిగిన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ సభలో సిఐటియు పట్టణాధ్యక్షులు పి.సూర్యారావు, బి.బాలరాజు, ఆటో యూనియన్ నాయకులు అమృతరావు, స్టాలిన్, నాయకులు పాల్గొన్నారు.

లింగపాలెం : చికాగో నగరంలో కార్మికులకు పనిగంటలు తగ్గించాలని పోరాడి సాధించుకున్న సందర్భంగా మేడేను ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు జరుపుకుంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, మటన్ గూడెం గ్రామాల్లో మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 2008 సంక్షోభం నేడు మరింతగా పెరిగిందని, ప్రపంచ దేశాల్లో కార్మికులు, ఉద్యోగుల వేతనాల్లో కోత పెడుతున్నారని, దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు తెలుపుతున్నాయన్నారు. వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతినడం వల్ల రైతు, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే విధంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమాలు పోరాటాలకు సన్నద్ధం కావాలని, అదే మేడే స్ఫూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బిజెఎన్.కుమారి, ఈశ్వరి, మార్తమ్మ, షరీఫ్, మస్తాన్ వల్లి పాల్గొన్నారు. **జీలుగుమిల్లి :** మే డే వేడుకలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు తెలిపారు. మంగళవారం మేడే వేడుకల సందర్భంగా జీలుగుమిల్లి, కామయ్యపాలెం అంగన్వాడీ సెక్టార్ సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని మేడే వేడుకలను జయప్రదం చేయాలని శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : కార్మికుల దినోత్సవమైన మేడేని జయప్రదం చేయాలని ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మేడే కరపత్రాలను మంగళవారం మండలంలోని మర్రిగూడెంలో ఆ సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థకు నిరసనగా ప్రపంచ కార్మికవర్గ పోరాట దినమైన మేడేను విజయవంత చేయాలన్నారు. ఖగార్ దాడులను ఆపి ఆదివాసులను రక్షించాలని మేడే సందర్భంగా డిమాండ్ చేస్తూ ఎర్రజెండా ఎగరవేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం డివిజన్ నాయకులు బాబురావు, కొండ రాము, మండల నాయకులు కట్టం కాటయ్య, చుట్టి నాగేశ్వరరావు, సోయం పుల్లేష్, కనకయ్య, నాలం దుర్గారావు, చూడెం రామారావు, మహిళా సంఘం నాయకులు చుట్టి జ్యోతి, చుట్టి నాగమణి, అరుణోదయ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మేడేను మండలంలో ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. ద్వారకాతిరుమల దొరసానిపాడు గ్రామాల్లో అంగన్వాడీ సెంటర్ల వద్ద మేడే గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని హక్కును రద్దు చేస్తోందని, 12 గంటలకు పెంచాలని ప్రయత్నించడం దారుణమన్నారు. దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం కార్మిక వర్గంపై నేడు మరింతగా పెరిగిందన్నారు. మేడే వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు హేమలత, అనంతలక్ష్మి, సుధా, నాగలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు టౌన్ : నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధాన అధికారి దేవరకొండ భూషణం తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ 8వ తరగతి నుంచి టెన్త్ క్లాస్ అర్హత కలిగిన వారు ఈనెల 29 నుంచి మే 24వ తేదీ వరకు వెబ్‌సైట్ %https//itiad-missions.ap.gov.in/iti/login.do% ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన కాపీ ప్రింట్‌తో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వ ఐటిఐలో మే 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మే 26వ తేదీ సాయంత్రం వరకు వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు జూన్ రెండవ తేదీ ఉదయం 9 గంటల నుంచి జూన్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏలూరు నగరంలో ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

ఏలూరు సిటీ : అమరావతి పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. ఏలూరులోని టిడిపి కార్యాలయంలో కూటమి పార్టీ ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా నాయకులతో మంగళవారం మోడీ పర్యటన నిమిత్తం సభను విజయవంతం చేయాలని దిశా నిర్దేశించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పక్కన జెడ్‌పి చైర్‌పర్సన్ గంట పద్మశ్రీ భర్త గంటా ప్రసాద్ కూర్చోవడంతో చింతమనేని ప్రభాకర్ చెయ్యి పట్టుకుని లాగి నీకు ఏ అర్హత ఉందని ఇక్కడ కూర్చున్నావని అడిగారు. దీంతో కొంత రసాభాస జరిగింది. నాదెండ్ల మనోహర్ కలిగజేసుకుని ఇరువురికి సర్ది చెప్పారు. అనంతరం రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మే రెండో తేదీన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతున్న మోడీ సభను ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగ రోషన్‌కుమార్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్లధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎపిఎస్ఆర్‌టిసి విజయవాడ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం వ్యాపారం చేయట్లేదు : నాదెండ్ల మనోహర్

రైతుల వద్ద నుంచి కేవలం 50 శాతం మాత్రమే ధాన్యం కొంటున్నారని ప్రశ్నించగా మేము వ్యాపారం చేయట్లేదని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సంవత్సరం పదివేల కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమే దాన్ని కొనుగోలు చేసిన 48 గంటల లోపు రైతులకు డబ్బులు జమ చేస్తుందని అన్నారు. ప్రభుత్వం 50 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడంతో మిగిలిన ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలో తెలియక రైతులు అయోమయంలో పడ్డారు.


మంత్రికి వినతిని అందజేస్తున్న రైతులు

సమస్యలు పరిష్కరించాలని కొల్లేటి రైతుల వినతి

ఏలూరు ప్రతినిధి : ఫారెస్ట్ అధికారులు తాము వ్యవసాయం చేసుకోకుండా అడ్డుకుంటున్నారని, రబీ మాసుళ్ల కూడా చేసుకోకుండా ఇబ్బందులు పడుతున్నామని నిడమర్రు మండలంలోని కొల్లేరు రైతులు మంగళవారం ఏలూరులో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యను వివరించారు. చేపల చెరువు కొట్టేయడంతో కోతకు వచ్చిన వరిపొలాలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలంటే రైతులు మంత్రిని, కలెక్టర్‌ను కోరారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, ధైర్యంగా ఉండాలంటూ మంత్రి, కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చి పంపించారు.

విజయవాడకు తరలిన శానిటేషన్ వర్కర్లు

ఏలూరు సిటీ : నరేంద్ర మోడీ మే 2వ తేదీన ఆంధ్రప్రదేశ్‌కి రానున్నడంతో విజయవాడలో పారిశుధ్య పనుల నిమిత్తం మంగళవారం ఏలూరు నుంచి వందమంది శానిటేషన్ వర్కర్లను పంపించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అన్నప్రగడ భాను ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా భాను ప్రతాప్ మాట్లాడుతూ సంబంధించిన పారిశుధ్య కార్మికులు విజయవాడ, ఏలూరు, హైదరాబాద్ రోడ్లలో పారిశుధ్య పనులు నిర్వహిస్తారని తెలిపారు. వీరికి భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వీరు మరలా మూడో తేదీన ఏలూరు వస్తారన్నారు. అనంతరం మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో పనుల పున్ణ ప్రారంభం మే రెండవ తేదీన జరుగుతుందని, దానికి నరేంద్ర మోడీ అమరావతి విచ్చేయుచున్నారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడంలో భాగంగా రాష్ట్రంలో నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు అమరావతికి చేరుకుంటారన్నారు. ఈక్రమంలో సభకు హాజరైన ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనుల నిమిత్తం వందమంది శానిటేషన్ వర్కర్లను విజయవాడ పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు ఎంఆర్ పెదబాబు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు : ఎంఇఒ

ముసునూరు : విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రయివేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ కొన్ని అనివార్య కారణాల వల్ల మే 2 నుంచి మే 19 వరకు మార్పు చేసినట్లు సమగ్ర శిక్షా ఎస్‌పి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ప్రకారం మే 20 నుంచి మే 24 వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారు. లాటరీ విధానంలో మొదటి విడత ఫలితాలను మే 29న విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 8న ఖరారు చేస్తారు. అలాగే రెండో విడత ఫలితాలను జూన్ 11న విడుదల చేసి సీట్లు సాధించిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ జూన్ 18న ఖరారు చేస్తారు. అదేవిధంగా దరఖాస్తు విధానం అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో %https://cse.ap.gov.in% వెబ్ సైట్‌లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత చిరునామా కోసం దరఖాస్తుదారుల తల్లిదండ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషన్ కార్డు, భూ హక్కుల పత్రం, ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. ఐబి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్ల వయసు, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు మే 31 నాటికి ఐదేళ్లు నిండిన పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599ను సంప్రదించవచ్చని తెలియజేశారు.

కోచింగ్ ఉపయోగించుకోవాలి

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కె.రాములు నాయక్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యార్థులు సప్లమెంటరీ కోచింగ్ తరగతులను ఉపయోగించుకుని ఉత్తీర్ణులు కావాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కె.రాములు నాయక్ తెలిపారు. పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు తెల్లంవారి గూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల దొరమామిడి పాఠశాలలో నిర్వహిస్తున్నటువంటి సప్లమెంటరీ కోచింగ్ తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పిఒ మాట్లాడుతూ తరగతులను ఉపయోగించుకొని విద్యార్థులందరూ ఉత్తీర్ణులు అవ్వాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఐటిడిఎ ద్వారా కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలను ఖండించాలి

సిపిఎం మండల కమిటీ

ప్రజాశక్తి - నిడమర్రు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలను ఖండించాలని, పేదల ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకొని, పేదలకు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. నిడమర్రులోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం గవర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ భూస్వాములు భూములకు అడ్డుగా ఉన్నారని, 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఉండి నియోజకవర్గం పాలకోడేరులో పేదల ఇళ్లు కూల్చివేయడాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకొని ఆపాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడి, రాజకీయ పదవి అండతో అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పీకర్ పదవికి అనర్హుడని, ప్రభుత్వం సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి, పేదలపై దాడి చేయడమేంటని, ఇల్లు కోల్పోయిన పేదలందరికీ ప్రభుత్వం వెంటనే ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, లావేటి చంద్రరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

ర్యాంప్ తొలగింపు

ఉద్దేశ్యపూర్వకంగానే చేశారు
న్యాయం చేయాలి : వైసిపి నేత పల్లి శ్రీను

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


పగలగొట్టిన ర్యాంపు

నగరపాలక సంస్థ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కక్షగట్టి ప్రొక్లైన్ తీసుకువచ్చి తమ ఇంటి ముందు ఉన్న సరిహద్దు గోడలు పడిపోయేలా ర్యాంపును పగలగొట్టారని వైసిపికి చెందిన పల్లి శ్రీను ఆవేదన వ్యక్తంచేశారు. ఏలూరులోని బావిశెట్టి వారి పేటలో మున్సిపల్ అధికారులు డ్రెయినేజీ పూడికతీతలకై పనులు ప్రారంభించారు. ఐతే బాధితుడు పల్లె శ్రీను మీడియాతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ అధికారులు కొంతవరకు వర్కర్స్‌తో పని చేయించి తన ఇంటి దగ్గరకు వచ్చేసరికి కక్షతో ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జెసిబిని తీసుకొచ్చి, తాను ఇంట్లో లేని సమయంలో గోడలు పడిపోయేలాగా ర్యాంపు పగలగొట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. తన భార్య వచ్చి ఎందుకు పగల గొడుతున్నారని అడిగితే కాంట్రాక్టర్, జెసిబి డ్రైవర్ దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. జెసిబితో గట్టిగా కొట్టేసరికి ఇంటి ఫౌండేషన్ మొత్తం పైకి లేచిపోయిందని, గోడలు మొత్తం బీటలు తీశాయని తెలిపారు. తమకు ముందుగా సమాచారం ఇస్తే మేము సహకరించే వాళ్లమని, మాకు చెప్పకుండా ఇలా చేయడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులను అడగగా ఎఇ వచ్చి మాట్లాడతానన్నారని, ఇప్పటి వరకు రాలేదని, తనకు జరిగిన ఈ అన్యాయాన్ని నగరపాలక సంస్థ అధికారులు సరిచేస్తారా? కాంట్రాక్టర్లు సరిచేస్తారా? అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరాలు


ముదినేపల్లి : శిక్షణా శిబిరంలో విద్యార్థులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు మంగళవారంతో రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థులచే కథల పుస్తకాలు చదవడం, వేమన పద్యాలు చెప్పించడం, చేతిరాత రాయించడం, చెస్, లూడో, క్యారమ్ ఆడించడం నిర్వహించారు. ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో 44 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి తెలిపారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు(సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం) రెండవరోజులో భాగంగా మంగళవారం ఉదయం నుంచి కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలను సీనియర్ రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థుల చేత సరదా ఆటలపోటీలు, కథలు చదివించుట, కథలు చెప్పించుటపై శిక్షణలను కొనసాగించారు. పి.శంకర్ డ్రాయింగ్‌లో మెళకువలపై శిక్షణ కొనసాగించారు. అనంతరం విద్యార్థులకు కొంత విరామ సమయం కలిగించి స్నాక్స్, చల్లటి పానీయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్‌కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఏలూరు బాలల గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎల్.చాముండేశ్వరరావు, మధ్యాహ్నపు పద్మనాభరావుచే నీతి కథలు చదివించుట, పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్‌వి గంగాభవాని టీచర్ వేమన శతక పద్యాలు వాటి భావాలు వివరించారు. విరామ సమయంలో విద్యార్థులకు ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ వివి.విశాలాక్షి స్నాక్స్, మజ్జిగ అందించారు. గ్రంథాలయంలో ని వివిధ పుస్తకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ రీడర్ దాడి గంగాధర్ రావు గ్రంథాలయానికి ఒక ఫ్యాన్‌ను, విద్యార్థులకు నోటు పుస్తకాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ నిర్వహకురాలు ఎం.శోభ, గ్రంథాలయ సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా గ్రామాభివృద్ధి

బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభంలో ఎంఎల్ఏ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

కూటమి ప్రభుత్వం రాకతో దెందులూరు నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి శరవేగంగా సాగుతుందని దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో రూ.45 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మించనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం దెందులూరు ఎంఎల్ఏ చింతమనేని ప్రభాకర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వంలో రహదారులన్నీ ఎంతో దుర్భరంగా తయారయ్యాయని, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలందరి ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టడంతో పాటు, దెందులూరు నియోజకవర్గంలో భారీ స్థాయిలో నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పలు రహదారుల నిర్మాణ పనులను, మరమ్మత్తు పనులను కూడా చేపట్టి పూర్తిచేయడం జరుగుతుందన్నారు. పినకడిమి గ్రామంలో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు సుమారు నెల రోజుల్లో త్వరితగతిన పూర్తయ్యేలా కూడా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చాట్రాయి : అనారోగ్యంతో ఆపరేషన్లు, వైద్యం చేయించుకున్న వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళవారం చాట్రాయి ఎంపిడిఒ కార్యాలయం వద్ద రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో చదువుకునే ఇద్దరూ లేక ముగ్గురు విద్యార్థులకు కూడా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున విద్యార్థుల ఖాతాకు జమ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి అధ్యక్షత వహించగా ఎంపిపి లంకా నిర్మల, మండల తహశీల్దార్ గీత, టిడిపి తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు నోబుల్ రెడ్డి, వెంకటేశ్వరరావు, అత్తులూరి, శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.